




కంపచెట్లతో నిండిపోయిన పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్

రేషన్.. డాన్

- మాఫియాలో గుత్తాధిపత్యం
- గుంటూరుకు చెందిన ఓ మిల్లర్‌తో కుమ్మక్కు
- ఎదురు తిరిగిన వారిపై అధికారులతో దాడులు.. కేసులు
- గతంలో వైసీపీతో.. ప్రస్తుతం కూటమి నేతలతో సంబంధాలు

పేదల బియ్యం బొక్కే రేషన్ మాఫియాలో ఓ డాన్ అవతరించాడు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ నేతలతో అంటకాగి.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన అక్రమాలకు అడ్డులేకుండా చేసుకునేందుకు గోడ దూకాడు. ఈ క్రమంలో సొంత సామాజికవర్గం పేరుతో జనసేన నేతలతో.. మరో సామాజిక వర్గం అండతో టీడీపీ నేతలతోనూ సంబంధాలు కొనసాగిస్తున్నాడు. రేషన్ మాఫియాను తన చెప్పుచేతుల్లో ఉంచుకునేందుకు కూటమి నేతలు, అధికారులను వినియోగించుకుంటున్నాడని సమాచారం. తన గుత్తాధిపత్యానికి చెక్ చెప్పే వారిని టార్గెట్ చేసి వారిపై అధికారులతో దాడులు చేయించి.. కేసులు పెట్టిస్తున్నాడు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా గుంటూరు పరిసరాల్లో వరుస గా రేషన్ బియ్యం పట్టుబడిందని సమాచారం. తనకు అడ్డు వస్తున్నాడని సొంత బావపైనే ఏకంగా దాడి చేసి తిరిగి అతడిపైనే కేసు పెట్టించి ఇతరులకు హెచ్చరికలు పంపాడు. తనకు తెలియకుండా రేషన్ బియ్యం కొన్నా, తనకు తెలియకుండా అమ్మినా వారి అంతు తేల్చడమే పనిగా ఈ డాన్ పెట్టుకోగా అతడికి అధికారులు పూర్తిగా సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. సాక్షాత్తూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి సొంత జిల్లా అయిన గుంటూరులో రేషన్ డాన్ ఇంతలా పెచ్చరిల్లిపోతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





- రెండు రోజుల క్రితం గుంటూరు పట్టాభిపురం పరిధిలో అక్రమంగా రవాణా చేస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు మీదగా కాకినాడ పోర్టుకు బియ్యాన్ని తరలిస్తున్నట్లు పోలీసులు కేసు పెట్టి ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నారు.

- తాజాగా బుధవారం తెల్లవారుజామున రెండు భారీ వాహనాల్లో తరలిస్తున్న 28 టన్నుల రేషన్ బియ్యాన్ని చేబ్రోలులో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనాలు వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి నుంచి గుజరాత్‌కు తరలిస్తుండగా తనిఖీల్లో దొరికినట్లు పోలీసులు తెలిపారు.

గుంటూరు, బాపట్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజుల్లో గుంటూరు పరిసరాల్లో ఈ ఘటనలు వెలుగులోకి వచ్చాయి. ఈ రెండు ఘటనల ద్వారా రేషన్ బియ్యం తరలింపును అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు అని అందరూ భావిస్తారు. అయితే ఇన్నాళ్లూ గుట్టుగా సాగిపోయిన ఈ వ్యవహారం రేషన్‌మాఫియాలో గ్రూపుల మధ్య కుమ్ములాటలతో వెలుగులోకి వచ్చింది. మొత్తం రేషన్ బియ్యం మాఫియాను తన గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న 'డాన్' ఒకరు ఈ వ్యవహారాలు మొత్తం నడిపిస్తున్నారని సమాచారం. తనకు అడ్డుగా ఉన్నవారిపై సదరు డాన్ అధికారులకు సమాచారం ఇవ్వడం.. అప్పటికప్పుడు వారు తనిఖీలు చేపట్టడం.. కేసులు పెట్టడం జరిగిపోతోంది. అక్రమాలకు అడ్డు వచ్చిన వారిని తొలగించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నాడు. తన గుత్తాధిపత్యానికి అడ్డువచ్చినవారు తనవారైనా.. పరాయివారైనా ఉపేక్షించేది లేదంటూ మాఫియా డాన్ హెచ్చరికలు చేస్తున్నాడు. తన మాట వినలేదన్న కసితో సదరు మాఫియా డాన్ సొంత బావను కూడా వదిలిపెట్టలేదు. అక్క భర్తన్న ఆలోచన కూడా లేకుండా తల పగలగొట్టాడు. తన పలుకుబడిని ఉపయోగించి గుంటూరు పట్టాభిపురంలో అక్రమంగా కేసు పెట్టి మిగిలిన వారికి తీవ్ర హెచ్చరికలు పంపాడు. గుంటూరులోని 201 రేషన్ షాపుల్లో 40కిపైగా షాపుల్లో ఈ డానే పెట్టుబడి పెడుతూ వాటిని తన అదుపాజ్ఞల్లో ఉంచుకుని రేషన్ మాఫియాను శాసిస్తున్నాడు. ఈ డాన్ గుంటూరు కాకాని రోడ్డులోని ఓ మిల్లర్‌తో కుమ్మక్కయ్యాడు. దాదాపు రెండు దశాబ్దాలుగా రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న ఈ డాన్ మిల్లర్‌తో కలిసి రేషన్‌బియ్యంపై గుత్తాధిపత్యానికి తెరతీశాడు. గతంలో వైసీపీతో అంటకాగిన సదరు డాన్.. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే తన సామాజిక వర్గాన్ని అడ్డుపెట్టుకుని జనసేనతో సంబంధాలు నెరుపుతున్నాడని సమాచారం. అదే పద్ధతిలో మరో ప్రధాన సామాజిక వర్గానికి చెందిన మిల్లర్‌తో కలిసి టీడీపీతో సంబంధాలు కొనసాగిస్తున్నాడు. సదరు మిల్లర్ ద్వారా ప్రాసెసింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి ఎగుమతి చేస్తున్నాడు.

డాన్‌కు అధికారుల విధేయత

రేషన్ మాఫియా డాన్ పౌర సరఫరాల శాఖ, విజిలెన్స్, పోలీసు అధికారులతో సత్సంబంధాలు నెరుపుతూ తన వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నాడు. అధికారులకు కావాల్సిన కేసులు కూడా తనే సమాచారం ఇచ్చి సహకరిస్తుంటాడు. కానివారిపై కేసులు పెట్టి దారికి తెచ్చుకుంటున్నాడు. ఇలా రేషన్‌మాఫియా గుత్తాధిపత్యం భరించలేని కొందరు సొంత ప్రయత్నాలు చేసుకుంటున్న మరికొందరు అక్రమార్కులపై అధికార బలాన్ని ఉపయోగించి కేసులు పెట్టిస్తున్నాడు. డాన్‌కు వ్యతిరేకంగా ఉన్నాడన్న కారణంగా వట్టిచెరుకూరు మండలం చెవళ్లమూడిలోని ఓ మిల్లర్‌పై అధికారులు పదే పదే దాడులు చేస్తున్నారు. గత జూలైలో ఆ మిల్లుపై దాడి చేసి 750 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. తాజాగా బుధవారం మరో 28 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. ఇలా పట్టుకున్న బియ్యాన్ని సదర్ డాన్‌తో చేతులు కలిపిన కాకాని రోడ్డులోని మిల్లుకే తరలిస్తున్నారు. కాకాని రోడ్డులోని మిల్లర్‌పై ఇప్పటికే లెక్కకు మించిన కేసులు ఉన్నా పట్టుబడిన బియ్యాన్ని ఆ మిల్లుకే తరలించి పౌర సరఫరాల శాఖ అధికారులు తమ విధేయతను చాటుకుంటుండడం విశేషం.

పీడీ యాక్టే విరుగుడు

వైసీపీ ప్రభుత్వంలో నేతలు సహజవనరుల దోపిడీనే కాకుండా పేదోడి బియ్యం మీద కూడా మాఫియాను వ్యవస్థీకృతం చేసి కోట్లు ఆర్జించారు. వైసీపీ నేతలకు ముడుపులు ముట్టచెప్పి దర్జాగా బియ్యం దందా చేసేవారు. మొక్కుబడిగా 6ఏ కేసులు నమోదు చేయడం తప్ప వ్యవస్థీకృతంగా మారిన రేషన్ దందాకు మాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. రేషన్ మాఫియాలోని కీలక వ్యక్తులపై పీడీ యాక్టు ప్రతిపాదనలను అధికారులు పంపినా రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అప్పట్లో నీరుగార్చారు. వ్యవస్థీకృతంగా మారిన దందాను కట్టడి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. కానీ క్షేత్రస్థాయిలో ఈ దందా చాలా వరకు కూటమి పార్టీ ద్వితీయశ్రేణి నేతల కనుసన్నల్లోనే నడుస్తుండడంతో ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతుంది. పైగా తనిఖీలకు వెళ్లిన అధికారులకు గత ప్రభుత్వంలో ఈ దందా జరగలేదా? ఇప్పుడు జరిగితే తప్పేంటన్న రీతిలో ప్రశ్నించడం బరితెగింపునకు నిదర్శనంగా కనబడుతోంది. నెలన్నర క్రితం నిజాంపట్నం మండలపరిధిలో బియ్యం నిల్వలు ఉన్నాయనే సమాచారంతో అధికారులు తనిఖీలకు వెళ్లగా అక్కడ దందాను నడిపిస్తున్న వ్యక్తుల వద్ద నుంచి యంత్రాంగానికి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. అద్దంకి నియోజకవర్గ పరిధిలో అధికారుల వాహనాలకు తమ వాహనాలను అడ్డుగా పెట్టి మరీ రేషన్ మాఫియా బెదిరింపులకు దిగింది. గత ప్రభుత్వం అటకెక్కించిన పీడీయాక్టు కేసు ప్రతిపాదనలను అమలు చేయడమే ఈ దందాకు విరుగుడుగా కనబడుతోంది. పదేపదే ఈ దందాలో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్టు చట్టం కింద కేసు నమోదు చేసి కఠినచర్యలుంటాయనే సంకేతాలను సదరు మాఫియాకు పంపగలిగితేనే కూటమి ప్రభుత్వంలోనైనా రేషన్ దందాకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంది. లేదంటే ప్రభుత్వం మారినా మూడు పువ్వులు ఆరు కాయలుగా ఈ మాఫియా వర్ధిల్లుతూనే ఉంటుంది. బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఈ రెండు నెలల్లో రేషన్ అక్రమార్కులపై 42 వరకు 6 ఏ కేసులు నమోదు కాగా 780 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం కేసులునమోదైన వారిలో గత ప్రభుత్వంలో 6ఏ కేసులు నమోదై ఉన్న వారు కూడా ఉండడం గమనార్హం.

భయానకంగా పరిస్థితులు

రేషన్‌మాఫియా మధ్య గొడవలు ఉద్రిక్తంగా మారుతున్నాయి. ఒకరిపై ఒకరు దాడులుచేసుకునే స్థాయిని దాటి పోలీస్ స్టేషన్ల వరకు వెళ్తున్నాయి. గతంలో పొన్నూరు చెందిన రేషన్ మాఫియా లీడర్ 'బర్నబాస్' హత్యోదంతం జరిగిన అనుభవాలున్నా అధికారుల్లో చలనం లేదు. గతంలో 2022 చివర్లో ఇదే మాఫియా డాన్ పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఓ రిపోర్టరుపై దాడి చేయించి తల పగలగొట్టిన ఘటన కూడా ప్రజలు ఇంకా మర్చిపోలేదు. కానీ మాఫియా తగాదాలు ఆందోళనకర స్థాయిలో జరుగుతున్నా యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

గతంలో రాజకీయ ఒత్తిళ్లు

వైసీపీ హయాంలో చివరి రెండేళ్లలోనే బాపట్ల జిల్లాలో దాదాపుగా 250 వరకు 6ఏ కేసులను అధికారులు నమోదు చేశారు. మూడు సార్లుకు మించి 6ఏ కేసులు పెడితే వారిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి అధికారులు చేశారు. రేషన్ మాఫియాలో కీలకంగా వ్యవహరించే చీరాలకు చెందిన ఓ వ్యక్తితో పాటు కారంచేడు పరిధిలోని వైసీపీ నేత అనుచరుడు, చినగంజాం మండల పరిధిలోని ఒకరితో సహా మొత్తం ముగ్గురిపై పీడీయాక్టు ప్రతిపాదనలను అప్పటి జేసీ శ్రీనివాసులు ఎస్పీకి పంపారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో వాటిని అటకెక్కించారు. తర్వాత రేషన్ మాఫియా జిల్లాలో మరింతగా చెలరేగిపోయింది.

నీటి సంఘాల.. సమరం

- ఈ నెల 16న ఎన్నికల షెడ్యూల్
- రైతు వర్గాలతో పాటు గ్రామాల్లో సందడి
- సాధారణ ఎన్నికల తర్వాత జరగనున్న తొలి ఎన్నికలు
- ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ప్రధాన పార్టీలు
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 259 సంఘాలకు ఎన్నికలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా నిర్వీర్యమైన సాగునీటిరంగాన్ని గాడి లో పెట్టే క్రమంలో కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. నిధులు ఇవ్వాల్సివస్తోందని లేదంటే కాల్వలకు మరమ్మతులపై నీటి సంఘాల నుంచి డిమాండ్లు వస్తాయనో వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికలను విస్మరించింది. సాగునీటి సంఘాల కు ఎన్నికలు లేకపోవడంతో కాల్వల మరమ్మతులు, వాటి బాగోగులు, నీటి నిర్వహణ ఐదేళ్లుగా జరగ లేదు. దీంతో కాల్వలు అధ్వానంగా మారిపోయి, సాగునీరు సక్రమంగా అందక రైతులు నష్టపోవాల్సివచ్చింది. ఈ క్రమంలో నీటి పంపిణీలో రైతులను భాగస్వామ్యం చేయడంతో పాటు కాల్వల బాగుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లుచేస్తోంది. ఈ నెల 16 నుంచి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణ ఎన్నికల అనంతరం జరగనున్న తొలి ఎన్నికలు కావడంతో ప్రధాన పార్టీలు వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. గ్రామ స్థాయిలో రైతు వర్గాల్లో పట్టు నిలుపుకునేందుకు ఆయా పార్టీల నేతలు సమాయత్తమవుతున్నారు. దీంతో పల్లెల్లో సాగు నీటి ఎన్నికల సందండి ప్రారంభమైంది. నీటి సరఫరాలో కీలకపాత్ర వహించే సంఘాలకు నేతృత్వం వహించేందుకు రైతులు ముందుకువస్తున్నారు. నాగార్జునసాగర్ కుడికాల్వ ప్రాజెక్టు కమిటీ పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో 259 నీటిసంఘాలు, 30 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. వీటి పదవీకాలం ముగిసినా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సాగునీటి సంఘాల ప్రాధాన్యాన్ని గుర్తించి ఎన్నికల నిర్వహణకు సిద్ధమైంది. ఈ క్రమంలో తొమ్మిదేళ్ల తర్వాత సదరు సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో సాగునీటి సంఘాల ఎన్నికల సందడి నెలకొంది.

ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు

ఈ సారి కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రుణ అర్హత కార్డులు పొందిన కౌలు రైతులకు ఓటు హక్కు కల్పించనున్నారు. అయితే కౌలు రైతులు వారు సాగు చేసుకుంటున్న భూముల సర్వే నెంబర్లలో యజమానులకు ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. భూమి, పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతులను ఓటర్లుగా గుర్తిస్తారు. సర్వే నెంబర్లు ఆధారంగా నీటి సంఘాల వారీగా ఓటర్లను కేటాయిస్తారు. నీటి సంఘాల పరిధిని ఇప్పటికే జలవనరుల శాఖ గుర్తించింది. చెరువుల ఆయకట్టు పరిధిలోని రైతుల వివరాలను మైనర్ ఇరిగేషన్ శాఖ సేకరించింది. ఒక్కో నీటి సంఘం పరిధిలో ఆయకట్టు ఆధారంగా రైతులకు ఓటు హక్కును కల్పిస్తారు. ఏ సర్వే నెంబరులో ఎంత మంది రైతులు ఉన్నారు. వీరిలో కౌలు రైతులు ఎంత మంది ఉన్నారో నిర్ధారిస్తారు. ఈ వివరాలు ఆధారంగా సాగు నీటి సంఘం పరిధిలో ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. జలవనరుల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా ఓటర్లను గుర్తిస్తున్నాయి.

సాగునీటి కాల్వలకు మహర్దశ

సాగునీటి సంఘాలకు ఎన్నికలతో కాల్వలకు మహర్దశ పట్టనున్నది. మరమ్మతులకు ఇవ్వాల్సిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంది. ఎన్నికలు జరగకపోవడంతో సంబంధిత అధికారులకే నీటి సంఘాల బాధ్యతలను అప్పగించారు. నీటి తీరువాకు సంబంధించిన కాడా నిధుల కేటాయింపు కూడా నిలిచిపోయింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారిమళ్లించి కాల్వల మరమ్మతులకు మొండిచేయి చూపింది. ఈ పరిస్థితుల్లో ఎన్నికలతో మళ్లీ సాగు నీటి సంఘాలకు పూర్వ వైభవం రానున్నది. కాల్వల మరమ్మతులకు పుష్కలంగా నిధులు రానున్నాయి.



కంప చెట్ల మూసుకు పోయిన గోవిందాపురం మైనర్ కాల్వ

40 రోజుల్లో ప్రక్రియ పూర్తి

ఈ నెల 16వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్నది. తొలుత సాగునీటి సంఘాలకు ఆ తదుపరి డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆ తర్వాత ప్రాజెక్టు కమిటీల ఎన్నిక జరగనున్నది. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో పూర్తిచేసేందుకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియపై కలెక్టర్లు, జలవనరులశాఖ అధికారులతో మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం ప్రత్యేకంగా సమీక్షించారు. సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక సంఘాలను గుర్తించి, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు.

సరస్వతి నమస్తుభ్యం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలానక్షత్రం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. అమ్మవారి ఆలయాల్లో గోపూజ, సువాసిని, సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ సరస్వతి అమ్మవారిగా అలంకరించారు. విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.

- గుంటూరు



కొల్లిపరలో శ్రీసరస్వతీదేవిగా అమ్మవారు అలంకరణ



పొన్నూరు: సరస్వతి దేవిగా దర్శనమిస్తున్న దుర్గాదేవి



గుంటూరు: స్థానిక బ్రాడీపేట శంకరమందిరంలో సరస్వతీదేవిగా అమ్మవారు



గుంటూరు: విద్యానగర్ 3వ లైన్‌లో శ్రీ సాయినాథ సన్నిధానంలో సరస్వతీదేవిగా అమ్మవారు



గుంటూరు: విద్యానగర్‌లో పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



తెనాలి: నందివెలుగులో మహిళల సామూహిక కుంకుమార్చన



తెనాలి మారీసుపేట: శ్రీవిద్యాపీఠంలో సరస్వతీదేవిగా అమ్మవారు

శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణకు సన్నాహాలు

- మాస్టర్ ప్లాన్ ప్రకారం కొలతలు వేస్తున్న అధికారులు
- హిందూ కళాశాల కూడలి నుంచి లాడ్జి సెంటర్ వరకు రూ.152 కోట్లతో మెగా ఫ్లైఓవర్

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: గుంటూరు నగరపరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న శంకర్‌విలాస్ బ్రిడ్జి విస్తరణకు సన్నాహాలు మొదలయ్యాయి. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో గుంటూరు నగరవాసుల చిరకాలవాంఛ నెరవేరనున్నది. హిందూ కాలేజీ కూడలిలోని టీబీ బంగ్లా నుంచి లాడ్జి సెంటర్ వరకు 120 అడుగుల మేర శంకర్‌విలాస్ ఫ్లైవోబర్‌ను రూ.152 కోట్లతో విస్తరించేలా అధికారులు డీపీఆర్ రూపొందించారు. అధికారులు రూపొందించిన డీపీఆర్‌ను ఆయన పరిశీలించారు. అధిక ప్రాధాన్యతగా శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులను చేపట్టాలని సూచించారు. దీంతో రైల్వే, మున్సిపల్, టౌన్‌ప్లానింగ్, సర్వే శాఖ అధికారులు బుధవారం శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణకు సంబంధించి సన్నాహాలు ప్రారంభించారు. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా కొలతలు తీస్తున్నారు. జీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ రెహమాన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సర్వేయర్లు బోయపాటి లక్ష్మీనారాయణ తదితరులు బుధవారం శంకర్ విలాస్ బ్రిడ్జి నుంచి బ్రాడీపేట వైపు ఐదు లైన్ వరకు మార్కింగ్ చేశారు. భవనాల యజమానుల వివరాలను వార్డు ప్లానింగ్ సెక్రటరీలు సేకరిస్తున్నారు. త్వరలో రోడ్డు విస్తరణ కింద భవనాలు, స్థలాలు కోల్పోయే వారికి నోటీసులు జారీ చేయనున్నారు.

మద్యం షాపులకు 4465 దరఖాస్తులు

- గడువు పొడిగింపు.. రేపటి వరకు అవకాశం
- భయపడకుండా దరఖాస్తు చేయాలన్న ఎక్సైజ్ డీసీ

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: మద్యం షాపుల లైసెన్సుల కోసం గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికి 4465 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. దరఖాస్తుల సమర్పణకు గడువు బుధవారంతో ముగియాల్సి ఉండగా ఈ నెల 11వ తేది రాత్రి 7 గంటల వరకు దరఖాస్తులకు అవకాశం ఉందన్నారు. 14న కలెక్టర్ సమక్షంలో మద్యం దుకాణాలకు లాటరీ జరుగుతుందన్నారు. పల్నాడు జిల్లాలో మొత్తం 129 షాపులకు 1591, గుంటూరు జిల్లాలో 127 షాపులకు 2874 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎక్కువమంది దరఖాస్తులు చేస్తున్నారన్నారు. ఆఖరి తేదీ వరకు ఆగకుండా వీలైనంత త్వరగా మద్యం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎవరికి భయపడాల్సిన పని లేదని, ప్రభుత్వం మద్యం షాపు నిర్వాహకులకు రక్షణ కల్పిస్తుందన్నారు.

గ్రీన్‌గ్రేస్‌పై బాధ్యతారాహిత్యం

- అక్రమాలకు మున్సిపల్ అధికారుల సహకారం
- ఇద్దరు కమిషనర్లు సహా 16 మందిపై చర్యలకు సిఫార్సు
- రాష్ట్ర ప్రభుత్వానికి గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ నివేదిక

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: గుంటూరు నగరం పట్టాభిపురంలో వైసీపీ నేత అంబటి మురళి చేపట్టిన గ్రీన్‌గ్రేస్ బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాల్లో బాధ్యతారాహిత్యం.. ఐదంతస్తులకు అనుమతి తీసుకుని 15 అంతస్తుల కడుతున్నా కన్నెత్తిచూడ లేదు.. రైల్వే ఎన్‌వోసీని రద్దు చేసినా అధికారులు పట్టించుకోలేదని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ కన్నబాబు, అనురాధలతోపాటు మరో 16మంది టౌన్‌ప్లానింగ్ అధికారులను బాధ్యులను చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు.జూట్‌మిల్‌కు చెందిన స్థలాన్ని 2015లో అంబటి మురళి డెవలప్మెంట్‌కు తీసుకుని నగరపాలకసంస్థ నుంచి అనుమతి లభించకపోయినా అడ్డగోలుగా అపార్ట్మెంట్ నిర్మాణ పనులు చేపట్టగా ఆ అక్రమాలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ వెలుగులోకి తెచ్చారు. దీంతో విచారణ చేపట్టిన కమిషనర్ అక్రమాలను నిర్ధారించారు. అప్పటి కమిషనర్లు కన్నబాబు, అనురాధ, టౌన్‌ప్లానింగ్ అధికారులు హిమబిందు, రిజ్వానతోపాటు మరో 14 మంది ఉద్యోగులు గ్రీన్‌గ్రేస్ అక్రమాలకు సహకరించారని తేల్చారు. 2019 నుంచి 2024 వరకు అడ్డగోలుగా నిర్మాణాలు జరిగినా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదని, అప్పటి ప్రభుత్వ ఒత్తిళ్లకు అధికారులు లొంగినట్లు గుర్తించారు.

నేడు విజిలెన్స్ తనిఖీలు

గ్రీన్‌గ్రేస్ అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టనున్నారు. ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ క్రమంలో విజిలెన్స్, కార్మికశాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు తెలిసింది.

వైద్య ఆరోగ్య శాఖలో 40 పోస్టుల భర్తీకి చర్యలు

గుంటూరు (మెడికల్) అక్టోబరు 9: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేసేందుకు వివిధ కేటగిరిల్లో మొత్తం 40 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్‌లు 3 పోస్టులు, ఫార్మసిస్టులు 11, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 11, శానిటరీ అటెండర్లు 15 పోస్టులను భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆమె వివరించారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అక్టోబర్ 16వ తేదీ నుంచి 30వ తేదీలోపు అందజేయాలని డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఆయా పోస్టుల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ ప్రజా ప్రతినిధులు


ఎమ్మెల్యే కన్నాను సన్మానిస్తున్న టీడీపీలో చేరిన వైసీపీ ప్రజా ప్రతినిధులు

సత్తెనపల్లి, అక్టోబరు 9: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. కన్నా నాయకత్వంలో సత్తెనపల్లి వైసీపీ జెడ్పీటీసీ మెంబర్ సంకటి నాగేశ్వరమ్మ, ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జెబున్నీసా బుధవారం కన్నా కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ పరంగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, కట్టా రమేష్, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణను టీడీపీలో చేరిన ప్రజా ప్రతినిధులు, బంధువులు ఘనంగా సన్మానించారు.

అట్టహాసంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శాప్ ఛైర్మన్ రవి నాయుడు

మంగళగిరి సిటీ, అక్టోబరు 9: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు బుధవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో కలిసి ఈ పోటీలను ప్రారంభించారు. తొలుత దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కొద్దిసేపు కబడ్డీ ఆడి ఉత్సాహ పర్చారు. ఈ సందర్భంగా రవి నాయుడు మాట్లాడుతూ మంత్రి లోకేశ్ సహకారంతో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నాలుగు రోజులపాటు జరిగే కబడ్డీ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 14 పురుషుల జట్లు, 14 మహిళల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో మంత్రి లోకేశ్ వివిధ రకాల పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఏపీని క్రీడల్లో అగ్రస్థానంలో నిలబెడతామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టేడియం పనులను పూర్తి చేస్తామన్నారు. త్వరలో స్పోర్ట్స్ పాలసీని విడుదల చేస్తామని వెల్లడించారు. ఏపీలో అంతర్జాతీయ క్రీడలను నిర్వహించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృఢ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం 90 శాతం స్టేడియాలను పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

విజయవాడ క్లబ్‌పై కూడా ఉక్కుపాదం

- మూసేయించిన మంత్రి లోకేశ్
- దీంతో జిల్లాలోని అన్ని క్లబ్‌లలో పేకాట బంద్
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గుంటూరు, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి): జంట నగరాలైన కృష్ణా, గుంటూరు జిల్లాల నడుమ ఉన్న విజయవాడ క్లబ్‌లో కూడా పేకాటకు బ్రేక్‌లు పడ్డాయి. తొలుత ఈ క్లబ్ మినహా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని క్లబ్‌లన్నింటినీ పోలీసులు మూసివేయించారు. అయితే తమకు లేని మినహాయింపు విజయవాడ క్లబ్‌కి ఇవ్వటంతో మిగతా క్లబ్‌ల పాలకవర్గాలు కించిత్ ఆగ్రహానికి గురయ్యాయి. ఒకటి, రెండు రోజుల పాటు కేవలం సభ్యులకు మాత్రమే పేకాట ఆడుకునేందుకు అనుమతి ఉంటుందని నోటీసు బోర్డు పెట్టి విజయవాడ క్లబ్‌లో పేకాట కొనసాగించారు. అయితే 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'టీడీపీలో క్లబ్‌ల చిచ్చు' పేరుతో వచ్చిన వార్తలో విజయవాడ క్లబ్‌కు మినహాయింపు ఇవ్వటం గురించి కూడా రావటంతో మంత్రిగా వ్యవహరిస్తున్న స్థానిక ఎమ్మెల్యే నారా లోకేశ్ పోలీసు అధికారులపై మండిపడినట్లు తెలిసింది. దీంతో ఈ రెండు రోజుల నుంచి విజయవాడ క్లబ్‌లో కూడా పేకాట నిలిచిపోయింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఐదు క్లబ్‌లు మూతపడిపోయాయి. ఇదిలా ఉండగా క్లబ్‌లను అయితే పోలీసులు కట్టడి చేయగలిగారు కానీ అనధికార అడ్డాలలో యథేచ్ఛగా జరుగుతున్న జూదాన్ని మాత్రం కట్టడి చేయకపోవటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా చెరుకుపల్లి ప్రాంతంలో అద్దె భవనాల్లో జోరుగా జూదం జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ సేవలు మరింత చేరువ చేస్తాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల


నూతన ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన మంత్రి మనోహర్

తెనాలి రూరల్, అక్టోబరు 09: ఏపీఎస్ ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం తెనాలి ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు బస్సులను మంత్రి మనోహర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ద్వారా ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నామన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీని నిర్వీర్యం చేయడంతో పాటు ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించలేదని ఆరోపించారు. తెనాలి డిపోలో వర్షం పడితే మోకాళ్ల లోతు నీళ్ల నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారని గతంలో బస్టాండ్ దుస్థితిని వివరించారు. తాము అధికారం చేపట్టిన తర్వాత తెనాలి ఆర్టీసీ డిపోలో వర్షం నీరు నిలవకుండా తగిన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తెనాలి నుంచి హైదరాబాదుకి రెండు ఏసీ బస్సులు, విజయవాడకు మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లు, పల్లచెరువుకి వినుకొండ మీదగా మరో రెండు ఎక్స్‌ప్రెస్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత బస్సులకు ప్రత్యేక పూజలను జరిపి అనంతరం రిబ్బన్ కటింగ్ చేసి బస్సు సర్వీస్ ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం ఎద్దు రాజశేఖర్, కార్యనిర్వహణాధికారి, తాహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎస్పీ జనార్దనరావు, పలు శాఖల అధికారులు, ఆర్టీసీ కార్మికులు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకులో మోసం దారుణం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకు వద్ద బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 9 : వందల కోట్ల నగదు, వందల సవర్ల బంగారం గల్లంతైనట్లు బాధితులు చెబుతున్నారు.. ఇది ఎంతో దారుణం.. ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఇంత మోసం జరుగుతుంటే యాజమాన్యం ఏం చేస్తుంది అని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగిన నేపథ్యంలో చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంక్ బ్రాంచ్‌ని బుధవారం ఆయన సందర్శించారు. బాధితులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మూడేళ్లుగా ఒక ప్రముఖ బ్యాంకులో మోసం జరుగుతుంటే ఉన్నతాధికారులు ఎందుకు పసిగట్టలేకపోయారని ప్రశ్నించారు. అక్రమాల్లో బ్రాంచి సిబ్బంది ప్రమేయం కూడా ఉన్నట్లుగా కన్పిస్తుందని అన్నారు. గత నెలలో కూడా డిపాజిట్లు గల్లంతైనట్లుగా సమాచారం ఉందనీ, ఇది పూర్తిగా బ్యాంకు వైఫల్యంగానే పరిగణించాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లో బాధితులకు అన్యాయం జరగడానికి వీల్లేదని ఆయన స్పష్టం చేశారు. బ్యాంకు మేనేజర్, గోల్డ్ అప్రైజర్ చేసిన మోసానికి ఖాతాదారులు బలయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేటతోపాటు నరసరావుపేట, విజయవాడ బ్రాంచ్‌లలో కూడా అవకతవకలు జరిగాయని ఆయన అన్నారు. బదిలీ అయిన మేనేజర్ గత నెలలో ఈ బ్రాంచ్‌లో ఒక ఎన్నారైని మోసం చేసి రూ.10 లక్షలు డిపాజిట్ కాజేశారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 100 మంది బాధితులు బయటకు వచ్చారని, వారిలో 76 మంది ఫిర్యాదు చేశారని బ్యాంకు రీజినల్ మేనేజర్ చెప్పారని అన్నారు. ఇంకా బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ఆధారాలున్న ప్రతి ఒక్కరికీ నగదు చెల్లిస్తామని బ్యాంకు ఉన్నతాధికారులు చెప్పారని తెలిపారు. ఆధారాలు లేకుండా ఎవరైతే నగదు ఇచ్చారో వాటిపై కూడా విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు. బ్యాంకుపై ఒత్తిడి తెచ్చి వారికి న్యాయం చేస్తామన్నారు. సీఐడీకి ఫిర్యాదు చేసినట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారని, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌తో తాను కూడా మాట్లాడతానని చెప్పారు. ఇది సీబీఐ దర్యాప్తుకు వెళ్లాల్సిన కేసు అని అన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి విచారణ జరపాలని కోరుతామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన తెలుగుదేశం ప్రభుత్వం అండగా ఉంటుందని, ధైర్యంగా ఉండాలని చెప్పారు.

పట్టాదారు పాసు పుస్తకం కోసం 30 ఏళ్లగా పోరాటం


పొందుగుల వెంకటరెడ్డి

గుంటూరు సిటీ, అక్టోబరు 9: 10 మంది కలెక్టర్లు.. 18 మంది తహసీల్దార్‌లు .. డజన్ల కొద్దీ వీఆర్వోలు మారారు. అయినా పాసు పుస్తకానికి మాత్రం మోక్షం కలగలేదు. తనకు జరిగిన అన్యాయంపై తాజాగా రాష్ట్రపతికి సైతం లేఖలు రాశారు. దీనికి సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పొందుగల వెంకటరెడ్డి గతంలో మైన్స్ నిర్వహించేవారు. ఆయన నకరికల్లు మండలం త్రిపురాపురంలో 1.50 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. తన మైన్స్‌లో పని చేసే కార్మికులకు ఆవాసం ఏర్పాటు చేసేందుకు గ్రామ సర్వే నంబరు 69లోని 5/1, 5/2లో ఉన్న భూమిని 1994 సెప్టెంబరు 7న కొనుగోలు చేశారు. భూమికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్‌లు కూడా పరిశీలించాకే కొన్నారు. అప్పటి నుంచి సదరు భూమికి అవసరమైన పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకని రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతూ నే ఉన్నారు. అయినా పట్టించుకోని రెవెన్యూ అధికారులు 2003లో గొప్ప ఘనకార్యానికి తెరలేపారు. వెంకటరెడ్డికి చెందిన పట్టా భూమిని పోరంబోకుగా చూపించి వేమయ్య, వేణుబాబు తదితరులకు పట్టాలు మంజూరు చేశారు. రాంకీ సంస్థకు సదరు భూమిని అప్పజెప్పేందుకు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై అప్పట్లో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో ఆఘమేఘాల మీద పట్టాలు రద్దు చేసి, బాధ్యులైన ఉద్యోగులను సస్పెండ్ చేశారు. రెవెన్యూ అధికారుల తప్పిదానికి కోర్టు లు కూడా మొట్టికాయలు వేశాయి. అయినా అధికారులు మాత్రం వెంకటరెడ్డిపై కనికరం చూపించలేదు. వెంకటరెడ్డి ఆధీనంలో ఉన్నది ప్రైవేటు భూమిని జిల్లా సర్వేయర్ కూడా పలుమార్లు నిర్ధారించారు. అయినా అధికారులు పాసుపుస్తకం ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు తనని ఇబ్బంది పెడుతున్న సంగతిని బాధితుడు వెంకటరెడ్డి తాజాగా రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం, డిప్యూటీ సీఎంకు ఫిర్యాదు చేశారు.

డీఎస్సీ శిక్షణకు కోచింగ్ సెంటర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), అక్టోబరు 9: ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు డీఎస్సీ శిక్షణ కోసం అర్హులైన కోచింగ్ సెంటర్స్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.మధుసూదనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ ఎస్సీ శిక్షణ కోసం ఆసక్తి ఉన్న సంస్థలు ఈ నెల 21లోగా https://tender.apeprocurement.gov.inఅనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో కోచింగ్ ఇచ్చిన అనుభవం, ఇక్కడ శిక్షణ పొందిన వారిలో కనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు పొంది ఉండాలని స్పష్టం చేశారు.

23న ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు

గుంటూరు (మెడికల్) అక్టోబరు 9: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా యూనిట్ ఎన్నికలు ఈ నెల 23న గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ఎం.తులసీ బ్రహ్మమ్మ తెలిపారు. 14న అసోసియేషన్ ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. 16న నామినేషన్ల స్వీకరణ, 17న నామినేషన్ల పరిశీలన, 18న నామినేషన్ల ఉప సంహరణ జరుగుతుందన్నారు. అక్టోబర్ 23న ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా శాఖకు ఎన్నికలు జరుగుతాయని ఆమె ప్రకటించారు.

ఎవరెస్ట్ అధిరోహణకు ఎస్ఆర్ఎం విద్యార్థులు


ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించనున్న ఎస్ఆర్ఎం విద్యార్థుల బృందం

మంగళగిరి సిటీ, అక్టోబరు 9: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంతో సాహసోపేతమైన ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు సన్నద్ధమయ్యారు. ఇంజనీరింగ్ విద్యార్థుల్లో మానసిక స్థైర్యం, దృఢత్వం పెంపొందించే క్రమంలో ఎవరెస్ట్ బేస్ క్యాంపు యాత్రకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ ఇన్నోవేషన్ విభాగం ఆధ్వర్యంలో ఈ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎస్ఆర్ఎం నుంచి మొత్తం 18 మంది ఎవరెస్ట్ యాత్రకు బయల్దేరుతున్నారు. నాలుగు నెలల కిందటే వీరిని ఎంపిక చేసి అధిరోహణకు అవసరమైన అన్ని రకాల శిక్షణ ఇచ్చారు. ముందుగానే నేపాల్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు అవసరమైన అనుమతులు తీసుకున్నారు. మంచుకొండల్లో సులభంగా ఎక్కేందుకు దోహదపడే హైకింగ్ షూస్, హైకింగ్ పోల్స్‌ను సమకూర్చారు. ఎవరెస్ట్ బేస్ క్యాంపును చేరుకునే క్రమంలో మొత్తం 134 కి.మీ నడిచి 5,600 మీటర్ల ఎత్తును అధిరోహించాల్సి ఉంటుంది. ఏపీ నుంచి తొలిసారి ఎవరెస్ట్ బేస్ క్యాంపు అధిరోహణకు బయల్దేరిన యూనివర్సిటీగా ఎస్ఆర్ఎం గుర్తింపు పొందనుంది. యూనివర్సిటీకి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత గురువారం విచ్చేయనున్నారు. ఎవరెస్ట్ యాత్రను ప్రారంభించి, వారికి అవసరమైన కిట్స్ మెడల్స్‌ను ప్రదానం చేయనున్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, సీఎల్ఎం డైరెక్టర్ అనూప్, ఎంటర్‌ప్రెన్యూర్ డైరెక్టర్ సిద్ధార్థ శంకర్ త్రిపాఠి తదితరులు పాల్గొంటారు.

10 సైన్స్ కోర్సులకు యూజీసీ డెబ్ అనుమతి

పెదకాకాని, అక్టోబరు 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. సైన్స్ కోర్సులు చదవాలని ఆకాంక్షతో ఉన్న ఉద్యోగులు, గృహిణులు, విద్యార్థులకు సువర్ణ అవకాశం లభించింది. విద్యాభివృద్ధికి అనుగుణంగా వర్సిటీ యాజమాన్యం తగు ప్రయత్నాలు చేపట్టింది. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ (యూజీసీ) పరిధిలో డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్)కు సైన్స్ కోర్సుల కొనసాగింపు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని పరిశీలించిన డెబ్ తాజాగా 2024 - 2025 విద్యా సంవత్సరానికిగానూ 10 సైన్స్ కోర్సులకు అనుమతి ఇచ్చారు. అందులో ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్, సైకాలజీ, స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, మైక్రో బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, బోటనీ కోర్సులకు అనుమతులు లభించాయి. ఈ సందర్భంగా దూర విద్య కేంద్రం సంచాలకులు ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ కోర్సులు పూర్తి చేయాలనుకున్న వారికి సదవకాశమని తెలిపారు. పది కోర్సులకు దరఖాస్తు చేసుకోగా, అన్నింటికి అనుమతి లభించడం సంతోషమన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరోకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా క్రికెట్ రాష్ట్ర జట్టుకు అఖిల పావని



మంగళగిరి సిటీ, అక్టోబరు 9: ఆంధ్రప్రదేశ్ మహిళా క్రికెట్ జట్టులో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావని స్థానం సంపాదించింది. ఈ నెల 17వ తేదీ నుంచి బరోడా వేదికగా జరగనున్న భారత సీనియర్స్ మహిళా టీ20 క్రికెట్ టోర్నీలో అఖిల పావని పాల్గొననుంది. గత నెల ఒకటో తేదీ నుంచి ఐదు రోజులపాటు ఢిల్లీలో జరిగిన ఢిల్లీ క్యాపిటల్స్ ఉమెన్ ఐపీఎల్ టీం ఎంపిక పోటీలకు హాజరైన ఆమె అద్భుత ప్రతిభ కనబర్చింది. మంగళగిరి నుంచి ఎంపికైన మొదటి మహిళా క్రికెటర్ పావని కావడం విశేషం. రాష్ట్ర జట్టుకు ఎంపికైన అఖిల పావనికి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138, 148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

36,741 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 37,958 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 36,741 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,585 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16000	334	10000	16000
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	10000	15000
273	8100	14500	273	12000	12500
341	8500	16700	341	9000	16900
4884	11500	11500	4884	13000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	12000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18500	తేజ	9000	18300
బ్యాడిగి	9000	16500	బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	9500	16500	దేవనూరు డీలక్స్	10000	15500
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	11500

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమిదే విజయం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్


పట్టభద్రులకు ఓటరు నమోదు పత్రాలు అందజేస్తున్న నసీర్

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్ర జ్యోతి): గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిదే గెలుపని, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అఖండ మెజార్టీతో గెలిపిస్తామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని రాష్ట్ర గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పట్టభద్రులకు ఓటరు నమోదు పత్రాలు అందజేశారు ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో యువత ఉద్యోగాలు లేక నిర్వీర్యమై పోయారని ఆరోపించారు. కూటమి ప్రభు త్వం ఏర్పడ్డ తర్వాత సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన కొనసాగతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని ఆయన తెలి పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాను భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో, కోటా పిచ్చిరెడ్డి, ఏడుకొండలు, వేల్పూరి కిరణ్, జిలాని పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంకు పాతగుంటూరు శాఖ ప్రారంభం

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ నూతన శాఖని పాతగుంటూరులో ప్రారంభించింది. బుధవా రం బ్యాంకు చైర్మన్ బోనబోయిన శ్రీనివాసయాదవ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ హాజరై ప్రారంభించారు. చైర్మన్ శ్రీని వాసయాదవ్ మాట్లాడుతూ అర్బన్ బ్యాంకు ఏర్పాటు చేసి 74 ఏళ్లు పూర్తి చేసు కొని వజ్రోత్సవంలోకి అడుగు పెట్టిందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్, డైరెక్టర్లు, బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరుకు 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చొరవతో గుంటూరుకు..

● ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో 6.5 ఎకరాల్లో వైద్యశాల

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరులో 100 పడకల ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఢిల్లీలో బుధవారం జరిగిన ఈఎస్‌ఐసీ 194వ సమావేశంలో కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గుంటూరులో ఈఎస్‌ఐ ఆస్పత్రి కోసం గతంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఆయన ప్రయత్నాలు ఫలించడంతో గుంటూరులో ఈఎస్‌ఐ ఆస్పత్రి నిర్మాణం లాంఛనమైంది. ఈ ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ ప్రతిపాదనకు కేంద్రం ఆమోద ముద్రవేసింది. ప్రతిపాడు మండలం నడింపాలెంలో సర్వే నెంబరు 110-సీ లోని 6.5 ఎకరాల స్థలంలో ఈ వైద్యశాలను కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తుందని మంత్రిత్వ శాఖ తెలిపింది. వైసీపీ ప్రభుత్వ వైఫల్యం కారణంగా ఐదేళ్లుగా ఈఎస్‌ఐ ఆస్పత్రి కలగానే మిగిలిపోయింది. ఇటీవల రూ.250 కోట్ల టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి మంజూరు చేయించడంలో సఫలీకృతులైన మంత్రి డాక్టర్ పెమ్మసాని ఈఎస్‌ఐ ఆసుపత్రి విషయంలో చొరవ తీసుకున్నారు.

రోత పుట్టిస్తున్న గుంటూరు బీజేపీ

● రోజుకో నేత రాసలీల వీడియోలు వైరల్

గుంటూరు, అక్టోబరు 9 : సంస్కృతి... సంప్రదాయాలు... ఆచార వ్యవహారాలకు పేటెంట్ రైట్ తమదేనని గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు తెరవెనుక సాగిస్తున్న రాసలీలలు సభ్య సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి... గడిచిన రెండు రోజులుగా వెలుగులోకి వస్తున్న బీజేపీ నేతల రాసలీలల వీడియోలు రోత పుట్టిస్తున్నాయి. తాము ఎవరికి తక్కువ కాదన్నట్లుగా పోటీలు పడి అసభ్యకరంగా ప్రవర్తించడమే గాక వీడియోలు తీయించుకుంటున్నారు. ఆయా వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ ఒకరిపై ఒకరు రాజకీయ ఆధిపత్యం కోసం హీనస్థితికి దిగజారుతున్నారు. బీజేపీకి చెందిన జిల్లా ముఖ్య నాయకుడు ఓ మహిళతో మాట్లాడిన రాసలీల కార్యాలు పార్టీ శ్రేణులను విస్మయానికి గురి చేశాయి. ఈ వీడియో విడుదలైన 24 గంటల్లోనే బుధవారం మరో ముఖ్య నేతకు చెందిన అసభ్యకరమైన వీడియో వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపింది. రెండు రోజుల్లో రెండు రాసలీలల వీడియోలు వెలుగులోకి రావడంతో బీజేపీ శ్రేణుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఆ నేతలే కాక మరికొందరు నేతల వీడియోలు కూడా ఉన్నాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి.

భువనేశ్వర్‌లో వివిధ ప్రాజెక్టులను పరిశీలించిన కమిషనర్

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: భువనేశ్వర్‌లోని వివిధ ప్రాజెక్టులను గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లలో అమలుచేస్తున్న కార్యక్రమాల స్టడీ టూర్‌లో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఒడిస్సా అర్బన్ అకాడమిలో వివిధ ప్రాజెక్టలను పరిశీలించారు. కమిషనర్‌కి ఒడిస్సా అర్బన్ అకాడమీలోని వికేంద్రీకృత ఘన వ్యర్థాల నిర్వహణ సెంటర్, మల వ్యర్థాల శుద్ధికేంద్రాల పనితీరుని స్థానిక అధికారులు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్, వ్యర్థాల నుంచి ఇతర ఉత్పత్తుల తయారీ ప్లాంట్, వ్యర్థాలతో కంపోస్ట్ తయారీ యూనిట్లను పరిశీలించిన కమిషనర్ బృందం ప్లాంట్‌ల నిర్వహణకు ఖర్చులు, కార్మికులు, యంత్రాల సామర్థ్యం స్థానిక అధికారులను అడిగా తెలుసుకున్నారు.


భువనేశ్వర్‌లో వివిధ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

విజ్ఞాన్‌లో ఘనంగా దాండియా ఉత్సవాలు

గుంటూరు(విద్య), అక్టోబరు 9: స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో దసరా వేడుకల సందర్భంగా విద్యార్థులు దాండియా ఉత్సవాలు నిర్వహించారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ నవరాత్రుల్లో చేసే దాండియా ఉత్సవాలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు. ఆడుతూ పాడుతూ చేసుకునే ఈ ఉత్సవాల్లో అత్యంత ఉత్సాహ వాతావరణంలో నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన్ వీసీ ఆచార్య పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి

గుంటూరు, అక్టోబరు 9 : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నల్లపాడు-అంకిరెడ్డిపాలెం మధ్య జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లపాడుకు చెందిన గుర్రాల మరియదాసు (59) మృతి చెందాడు. మరియదాసు సమీపంలోని గాజు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తుంటాడు. విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై అంకిరెడ్డిపాలెం వైపు నుంచి ద్విచక్ర వాహనంపై నల్లపాడులోని ఇంటికి బయలుదేరాడు. సాయిబాబా గుడి సమీపానికి రాగానే లారీ ఢీకొట్టడంతో పక్కకు పడిపోయాడు. అదే సమయంలో అటుగా అతివేగంగా వెళుతున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో మరియదాసు ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

గుంటూరు, అక్టోబరు 9 : ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతోన్న పలకలూరురోడ్డులోని రత్నగిరినగర్‌కు చెందిన వెలుగోలు వెంకటేష్‌ని నగరంపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేసారు. అతని వద్ద నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వీరానాయక్, నగరంపాలెం ఎస్సై రామాంజనేయులు తెలిపారు.

కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు

● జేసీ భార్గవ్ తేజ

గుంటూరు సిటీ, అక్టోబరు 9 : కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ నెహ్రూ యువ కేంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమ ఏర్పాట్లపై జేసీ భార్గవ్‌తేజ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర, గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 5 రోజుల పాటు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే కశ్మీర్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో కశ్మీర్‌లోని 6 జిల్లాల నుంచి మొత్తం 132 మంది యువత పాల్గొంటారన్నారు. వీరికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో బస ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమీక్షలో గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, జిల్లా పంచాయత్ ఆఫీసర్ బీవీఎస్ సాయికుమార్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి కె.శ్రీహరి, జిల్లా టూరిజం అధికారి ఏ.శ్రీరమ్య, జిల్లా క్షేత్ర ప్రచార అధికారి రమేష్ చంద్ర, పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ అబ్దుల్ రఫీక్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న జేసీ భార్గవ్ తేజ


ప్రసంగిస్తున్న ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్ భరత్‌తేజ

పీఎం స్వానిధితో చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత

● ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ భరత్‌తేజ

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: ప్రధాన మంత్రి స్వానిధి ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక చేయూత అందుతుందని, గుంటూరు నగరంలోని వీధి వ్యాపారులను స్వానిధి వెబ్ సైట్‌లో నమోదు చేయించాలని ఏపీ మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్ భరత్‌తేజ, ఆర్‌పీలు, సీఎంఎంలను ఆదేశించారు. బుధవారం స్వా నిధి సే సమృద్ధి వారోత్సవాల్లో భాగంగా నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారులు, ఆర్‌పీలతో జరిగిన సమావేశంలో మెప్మా మిషన్ డైరెక్టర్ పాల్గొన్నారు. భరత్‌తేజ్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వానిధి అమలు చేస్తుందని, స్వానిధిలో నమోదు చేయడం ద్వారా వారికి 8 రకాల సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఆర్‌పీలు తమ పరిధిలోని వీధి వ్యాపారులకు పథకంపై అవగాహన కల్పించి, ఈ నెల 7 నుంచి 12 వరకు జరుగుతున్న వారోత్సవాల్లో నమోదు చేయించాలని ఆదేశించారు. స్వానిధిలో నమోదు కావడం ద్వారా వారికి తొలుత రూ.10 వేలు, సక్రమంగా చెల్లిస్తే తిరిగి రూ.20 వేలు, ఆ తర్వాత రూ.50 వేలు అతి తక్కువ వడ్డీ రేటుకి రుణాలను బ్యాంకులు అందిస్తాయని తెలిపారు. జీఎంసీ పరిధిలో వీధి వ్యాపారుల కోసం వెండింగ్ జోన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపితే తగిన తోడ్పాటుని అందిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, జీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ సజీల, ఉపా సెల్ పీవో బాలాజీ, సీడీపీవో కృష్ణవేణి, బ్యాంకు మేనేజర్లు, ఆర్‌పీలు, సీఎంఎంలు, సీవోలు, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.


బాధితులకు చెక్కు అందజేస్తున్న వేద సీడ్స్ ఎండీ చంద్రశేఖర్ తదితరులు

వైద్య ఖర్చులకు వేద సీడ్స్ ఎండీ ఆర్థిక సాయం

గుంటూరు, అక్టోబరు 9: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కుంచనపల్లి గ్రామా నికి చెందిన బి.శ్రీనివాసరావుకు వైద్యఖర్చుల నిమిత్తం రూ.15 వేలను వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.చంద్రశేఖర్ బాధిత కుటుంబసభ్యులకు బుధవారం అరండల్‌పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక తోడ్పాటును అందచేసిన వేద సీడ్స్ యాజమాన్యానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో వేద సీడ్స్ హెచ్‌ఆర్ జీఎం తోట రంగారావు, ప్రొడక్షన్ జీఎం గుడి సతీష్ కుమార్, పీఆర్‌వో ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం తదితరులున్నారు.

రూరల్ ఈఆర్‌వో కార్యాలయం ఏఏవోగా చంద్రశేఖర్

గుంటూరు, అక్టోబరు 9: సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలోని రూరల్-1 విద్యుత్ రెవె న్యూ కార్యాలయం (ఈఆర్‌వో) అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ (ఏఏవో)గా బి చంద్రశేఖరరావు పాతగుంటూరు మెయిన్ రోడ్డులోని కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చంద్రశేఖర్ గతంలో పల్నాడుతో పాటు గుంటూరు రూరల్ ఈఆర్‌వోలో, గుంటూరు టౌన్-2 డివిజన్ కార్యాలయంలో జేఏవోగా పని చేశారు. వినుకొండ ఈఆర్‌వోలో పనిచేస్తూ ఏఏవోగా ఉద్యోగోన్నతి పొంది ప్రకా శం జిల్లా కందుకూరుకు బదిలీ అయ్యారు. తాజా బదిలీల్లో భాగంగా సీఆర్‌డీఏ సర్కిల్ పరిధిలోని రూరల్ ఈఆర్‌వో కార్యాలయం ఏఏవోగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించటంతో పలువురు ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు మృతి

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 9: ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖలో చిలకలూరి పేటలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చావల శ్రీనివాసరావు (45) బుధవారం మృతి చెందారు. స్టేషన్లో సెంట్రీగా విధి నిర్వహణలో ఉండగా అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో పడిపోయాడు. చిలకలూరిపేటలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం గుంటూరు రమేష్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కే.శ్రీనివాసులు, ఈఎస్ అరుణకుమారి, రాష్ట్ర ఎక్సైజ్ కానిస్టేబుల్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్పు కోటయ్య తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

షెడ్యూల్ ప్రకారం పల్లె పండగ - పంచాయతీ

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు'లో భాగంగా అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు ఉపాధి హామీ పథకంలో మంజూరు చేసిన పనుల శంకుస్థాపన కార్యక్రమాలు నిర్దేశిత మార్గ దర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆమె ఈ కార్యక్రమం నిర్వహణపై ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో మంజూరు చేసిన పనులను అక్టోబరు 14 నుంచి 20వ తేదీ వరకు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించాలన్నారు. జిల్లాలోని 114 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద రూ.13.93 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల ఏర్పా టు, అభివృద్ధికి సంబంధించి 160పనులకు పరిపాలన ఉత్తర్వులను మంజూ రు చేశారన్నారు. అన్ని మండలాల్లో మంజూరు చేసిన పనుల శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాలను నిర్వహించి పనులను ప్రారంభించేలా జడ్పీ సీఈవో, డ్వామా, డీపీవో, పంచాయతీరాజ్ ఎస్ఈ, డీఆర్‌డీఏ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డ్వామా పీడీ శంకర్, డీపీవో సాయికుమార్ పాల్గొన్నారు.

జిల్లాలో పర్యటించనున్న జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం


జిల్లాలో పర్యటించనున్న జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందంతో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, అక్టోబరు 9 : పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అమ లు చేసిన కార్యక్రమాలను పరిశీలించేందుకు జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం గుంటూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ బృందం ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని వివిధ పంచాయతీలను సందర్శించి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అమలుచేస్తున్న కార్యక్రమాలను పరిశీలిస్తారు. మేడికొండూరు, మంగళగిరిపాడు, పెదకాకాని, తంగెళ్ళ మూడి, అగతవరప్పాడు, పుసులూరు, పెదనందిపాడు, రేపూడి, మేరిక పూడి, శిరంగిపాలెం పంచాయతీలను జాతీయస్థాయి పర్యవేక్షణ బృందం సందర్శిస్తుంది. ఈ మేరకు బుధవారం కలెక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

కలెక్టర్ చొరవతో తగ్గిన నూనె ధరలు

● సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.130.. పామాయిల్ రూ.120

గుంటూరు సిటీ, అక్టోబర్ 9 :దిగుమతి సుంకం పెంపు కారణంగా జాతీయ స్థాయిలో మండిపోతున్న నూనె ధరలను గుంటూరు జిల్లాలో అదుపు చేసేందుకు కలెక్టర్ నాగలక్ష్మి చొరవ చూపారు. నూనె తయారీదారులు, మిల్లర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి నూనె ధరలు తగ్గించేందుకు వారిని ఒప్పించారు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ ప్యాకెట్ రూ.135 వరకు, ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.140 వరకు విక్రయిస్తున్నారు. కలెక్టర్ విజ్ఞప్తి మేరకు గురువారం నుంచి రుచి గోల్డ్ పామాయిల్ లీటర్ ప్యాకెట్ రూ.120చొప్పున, ఫ్రీడమ్ సన్ ఫ్లవర్ ఆయిల్ రూ.130 చొప్పున విక్రయించేందుకు మిల్లర్లు సిద్ధపడ్డారు. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న రైతు బజారు, చుట్టుగుంట రైతుబజార్, బండ్ల బజారు నందలి హోల్‌సేల్ వంటనూనెల దుకాణాల్లోను ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

పాతగుంటూరు ఎస్‌ఐ భాగ్యరాజు సస్పెన్షన్

గుంటూరు (కార్పొరేషన్), అక్టోబరు 9 : పాతగుంటూరు పోలీస్‌స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న భాగ్యరాజును సస్పెండ్ చేస్తూ ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాతగుంటూరు, బుడంపాడుకు చెందిన రెండు వర్గాల మధ్య ఆస్తి వివాదం నడుస్తుంది. అయితే ఎస్‌ఐ ఒక వర్గానికి కొమ్ము కాసి మరోవర్గాన్ని వేధింపులకు గురి చేయటతో పాటు పలు విధాలుగా హింసించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారించిన ఉన్నతాధికారులు వాస్తవమని తేలటంతో ఎస్‌ఐ భాగ్యరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు


సంపత్‌నగర్‌లో శారద పరమేశ్వరీ ఆలయంలో సరస్వతీదేవిగా అమ్మవారు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 9: భక్తులను కరుణించే జగన్మాత శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బుధవారం మూలా నక్ష త్రం పురస్కరించుకుని అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. గోపూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూ హిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలు దేవాలయాల్లో సరస్వతీ అమ్మవారిగా అలంక రించారు. విద్యార్థులు పాల్గొని సామూహిక సరస్వతి పూజలు నిర్వహించారు. పలు దేవాలయాల్లో చిన్నా రులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. కమిటీ సభ్యు లు, స్వచ్ఛంద సంస్థలు విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రవచనాలు జరిగాయి.

● గుంటూరు, అక్టోబరు 9: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వాహకులు ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఏటుకూరు రోడ్డులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. సంగడిగుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలో, లాలాపేట గంటలమ్మ చెట్టు వీధిలోనున్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో, చుట్టుగుంట పోలేరమ్మతల్లి ఆలయంలో, బ్రాడీపేట మెయిన్‌రోడ్డులోనున్న కోదండరామాయలంలో సరస్వతీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు.

సరస్వతి కమిటీ స్కూల్లో...

గుంటూరు(విద్య), అక్టోబరు 9: స్థానిక కాకాని రోడ్డులోని సీతారామ్‌నగర్‌లో ఉన్న సరస్వతి కమిటీ స్కూల్లో బుధవారం అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోని అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం పాఠశాల కమిటీ సభ్యులు అక్షరాభ్యాసం చేసిన చిన్నారులకు పలకలు, పుస్తకాలు, అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి. విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు మానసవీణ, జయరాము తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రత్యేక పూజలు

గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు దేవస్థానాల్లో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పూజలు చేశారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం అయిన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం గుంటూరులోని శారదాంబ పీఠం, కాశీ అన్నపూర్ణేశ్వరి దేవస్థానం, శారద పరమేశ్వరి అమ్మవారి దేవాలయం, పట్నంబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అమ్మవారి కృప ప్రతి ఒక్కరి మీద ఉండాలని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సిరిసంపదలు, సంతోషాలతో తుల తూగాలని, ఆ అమ్మవారిని గల్లా మాధవి ప్రార్థించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మాధవికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

నియోజకవర్గ పేదలకు బాసటగా ఉంటా: ఎమ్మెల్యే మాధవి

నియోజకవర్గంలో సాయం కోరి తన కార్యాలయానికి వచ్చే పేదలకు అన్ని విధాలా అండగా ఉంటానని పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి చెప్పారు. నియోజకవర్గ ప్రజల నుంచి బుధవారం ఆమె వినతులు స్వీకరించారు. రెండు కిడ్నీలు దెబ్బతిని, హృద్రోగంతో బాధపడుతున్న తురగ వెంకట పిచ్చయ్య కుమారుడు కరుణ్‌కుమార్‌కు పింఛను ఇప్పించాలని కోరగా, తాను మాట్లాడి పింఛను అందేలా చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. వినికిడి, మూగ క్రీడాకారులకు ఆర్థిక సాయం అందజేశారు.

ప్రతిభకు పేదరికం అడ్డం కారాదు

పాట్నాలో అక్టోబరు 13 నుంచి 19వరకు జరిగే 'ఇండియన్ డెఫ్ (వినికిడి) క్రికెట్ అసోసియేషన్ ఎనిమిదో టీ- 20' పోటీలకు ఎంపికైన గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన బధిరులు వేణు సిలివేరు, సుబ్రహ్మణ్యంలకు ఎమ్మెల్యే గల్లా మాధవి ఆర్థిక సాయం చేశారు. పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న వారికి రూ.10వేల చెక్కును బుధవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడాలి

పశ్చిమ నియోజకవర్గంలో ఉన్న సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వీడి, ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని ఎమ్మెల్యే మాధవి సూచించారు. నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో 92, 93, 94, 95, 96 సచివాలయాల సిబ్బందితో బుధవారం ఆమె సమావేశమయ్యారు. 29వ డివిజన్ తాను వెళ్లిన సమయంలో గంట తరువాత కూడా ఒక్క సిబ్బంది రాకపోవటం నిర్లక్ష్యం కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి సచివాలయంలో మార్పు కనిపించాలన్నారు. గురువారం నుంచి సచివాలయాల ఆకస్మిక తనిఖీలు చేపడతానని ఆమె చెప్పారు.

వరద సాయంపై నీలి మీడియా ఫేక్ ప్రచారం : మన్నవ



గుంటూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద సాయంపై వైసీపీ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అతని ముఠా, నీలి మీడియా చేస్తున్న దుష్ప్రచారా న్ని ప్రజలు తిప్పికొట్టాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహ నకృష్ణ పిలుపునిచ్చారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ. 203 కోట్ల మేర సాయం చేస్తే అందులో రూ.534 కోట్ల దోపిడి జరిగిందని జగన్ రెడ్డి, అతడి ముఠా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజల్ని పక్కదారి పట్టించే ప్రయ త్నం చేయడం దారుణమన్నారు. వరద సాయంపై వైసీపీ చర్చకు రావాలని మోహన కృష్ణ సవాల్ చేశారు. నష్టపోయిన కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ద్వారా ఖర్చు చేసిన మొత్తం వరద సాయం విలువ రూ.139.75 కోట్లు కాగా, సివిల్ సప్లయిస్ శాఖ అదనంగా రూ.63.60 కోట్ల విలువైన బియ్యం, నిత్యావసరా లు పంపిణీ చేశారన్నారు. మొత్తంగా కలిపి రాష్ట్ర ప్రభుత్వం రూ.203.3 కోట్లు వరద సాయంగా ఖర్చు చేయగా, వైసీపీ నీలిమీడియా పత్రికలో మాత్రం రూ. 534 కోట్లు బొక్కేశారంటూ విషప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిందిపోయి దుష్ప్రచారం చేయడమా? అంటూ నిలదీశారు. వరదలప్పుడు జగన్‌రెడ్డి రూ.కోటి సాయం ప్రకటించి కనీసం వెయ్యి రూపాయలన్నా ఇవ్వలేదని విమర్శించారు. నోరు తెరిచి నిజం చెప్పడం తెలియని జగన్ అనర్గళంగా అబద్దాలు చెబుతూ ప్రజలను వంచిస్తున్నాడన్నారు. జగన్ రెడ్డి ముఠా చేస్తున్న దుష్ప్రచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోహన కృష్ణ కోరారు.

బీజేపీ నేతల రాస లీలలు

● వైరల్ అవుతున్న వీడియోలు
● కోవర్ట్ ఆపరేషన్లతో పార్టీ పరువు రోడ్డున

గుంటూరు, అక్టోబరు 9: సంస్కృతి.. సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలకు పేటెంట్ రైట్ తమదేనని గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు తెరవెనుక సాగిస్తున్న రాస లీలలు సభ్యసమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయి. గత రెండు రోజులుగా వెలుగులోకి వస్తున్న బీజేపీ నేతల రాసలీలల వీడియోలు రోత పుట్టిస్తున్నాయి. పోటీలు పడి అసభ్యకరంగా ప్రవర్తించడమేగాక వీడియోలు తీయించుకుంటున్నారు. ఆయా వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ ఒకరిపై ఒకరు రాజకీయ ఆధిపత్యం కోసం హీనస్థితికి దిగజారుతున్నారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఈ నాయకుల రాసలీలలు బీజేపీతోపాటు మిగిలిన రాజకీయ పక్షాల్లోనూ కలకలం రేపుతున్నాయి. ఆయా వీడియోలు చూసిన బీజేపీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. బీజేపీకి చెందిన జిల్లా ముఖ్య నాయకుడు ఓ మహిళతో వీడియో కాల్‌లో మాట్లాడుతూ 'నాతో వస్తావా... మందు తాగుదామా' అని ఆహ్వానిస్తూ చేసిన రాసలీల వ్యాఖ్యలు పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేశాయి. ఈ రాసలీల వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో విడుదలైన 24 గంటల్లోనే బుధవారం మరో ముఖ్య నేతకు చెందిన అసభ్యకరమైన వీడియో వెలుగులోకి రావడం తీవ్ర కలకలం రేపింది. సభ్యసమాజం సిగ్గుపడేలా వికృత చేష్టలతో ఉన్న ఆ వీడియో జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రెండు రోజుల్లో రెండు రాసలీలల వీడియోలు వెలుగులోకి రావడంతో బీజేపీ శ్రేణుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. ఆయా నేతలకు సంబంధించిన మరి కొన్ని వీడియోలు ఉన్నాయనే ప్రచారం కూడా సాగుతోంది. ఆ నేతలే కాక మరి కొందరు నేతల వీడియోలు కూడా ఉన్నాయని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. మొత్తం మీద బీజేపీలో జరుగుతున్న కోవర్ట్ ఆపరేషన్ వ్యవహారం ఆ పార్టీని రోడ్డున పడేసింది.

ఇంకా ఎవరెవరి వీడియోలు వెలుగులోకి వస్తాయోనని ఆ పార్టీ శ్రేణులు ఆందోళన చెందుతుంటే, వైరివర్గాలు మాత్రం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి. వీడియోల పరంపర భవిష్యత్తులో ఎటువంటి పరిస్థితులకు దారితీస్తుందో, అధిష్ఠానం ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించండి

● మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 9: పట్టణంలో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని శానిటేషన్ అధికారులకు మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు సూచించారు. బుధవారం పట్టణంలోని 37వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా పారిశుధ్య పనులను నిర్వహిస్తున్నామన్నారు. వార్డు ప్రజలు చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని, మురుగు కాలువలో వేయరాదని అన్నారు. ముఖ్యంగా మూడు బుట్టల విధానాన్ని పాటించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సుందర, ఆరోగ్య తెనాలిని సాధించవచ్చన్నారు. అనంతరం 29వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి, వార్డు సచివాలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నాటిక ప్రదర్శకులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్న నాటికలు

తెనాలి అర్బన్, అక్టోబరు 9: కళల కాణాచి వేద గంగోత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శిస్తున్న నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో బుధవారం పలు సాంఘిక, పద్య నాటిక, నాటకాలు ప్రదర్శించారు. పెదకాకాని గంగోత్రి కళాకారులు ప్రదర్శించిన అష్టమవసువు నాటికను బి.శ్రీనివాసరావు రచించగా నాయుడు గోపి దర్శకత్వం వహించారు. సమాజంలో సాటి వారి కోసం ఎన్నో దానాలు ఉన్నాయని, అన్ని దానాల్లోకెల్లా గొప్పదనం ఇదేనంటూ అన్నదానం, గోదానం, వస్త్రదానం, కన్యాదానం వంటివి ఉదహరిస్తారని, కానీ రక్తదానం, అవయవదానం ప్రాధాన్యతను నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ గ్రహించాలనే సందేశాన్ని కళాకారులు చాటి చెప్పారు. పొన్నూరు రసచారి వారి గురితప్పిన వేట నాటికను మృత్యుంజయరావు నాటకీకరణ చేయగా కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. సమాజంలోని కొందరు డబ్బు సంపాదనకు అడ్డదారులు సులభమని భావిస్తున్నారని, అదే మార్గంలో వెళుతున్న యువకుడు ప్రయత్నం ఎందుకు విఫలమైందో ఆసక్తిగా ప్రదర్శించారు. హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన స్వేచ్ఛ నాటకాన్ని బీఎం రెడ్డి దర్శకత్వంలో శివరామ్ నాటకీకరణ చేశారు. మనసుకు నచ్చినట్టు ఉండే స్వేచ్ఛకన్న నిర్ణయాత్మక వైఖరితో నియంత్రణలో ఉండటమే సరైన స్వేచ్ఛ అని ఈ నాటిక సాటి చెప్పింది. చీరాల పూర్ణోదయ ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించిన నాటిక నేనేం చేసుకుంటాను పూర్ణ సత్యం దర్శకత్వంలో కృష్ణమూర్తి రచించారు. మనిషిలో ఉండే భయమో, భక్తో దేవాలయానికి ఆధ్యాత్మిక భావానికి చేరువ చేస్తుందని కష్టం వచ్చినప్పుడు మాత్రమే దేవుడిని మొక్కే మనుష్యులు ఆ తరువాత మరిచిపోవడం ఇతివృత్తంగా ఈ నాటిక ప్రదర్శించారు. నాటికలు ప్రదర్శించిన వారికి వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు-2024 కమిటీ సభ్యులు బుర్రా సాయిమాధవ్, చెరుకుమల్లి సింగారావు, నాయుడు గోపి తదితరులు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

గ్రామాల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

● ఎంపీపీ భీమవరపు పద్మావతి

కొల్లిపర, నవంబరు 9: గ్రామాలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషిచేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ప్రభుత్వ అధికారులతో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ కృష్ణానది వరదలు కారణంగా లంక భూముల్లో ఇసుక మేటవేసిందని దానిని ఉపాధిహామీ పథకం ద్వారా తొలగించటానికి త్వరలో అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలో కోటి 19లక్షల రూపాయలతో సీసీ రోడ్లు నిర్మించటానికి నిధులు మంజూరైనట్లు తెలియజేశారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, తహసీల్దార్ సిద్ధార్థ, ఈవోపీఆర్డీ భార్గవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి, వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో ఎస్‌బీఐది సరళమైన విధానం

● రుణమేళాలో రీజనల్ మేనేజర్ జగదీష్‌కుమార్

తెనాలి అర్బన్, అక్టోబరు 9: ఖాతాదారులకు రుణాలు మంజూరు చేసే విషయంలో సరళమైన విధానాలను ఎస్‌బీఐ అమలు చేస్తోందని రీజనల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. చెంచుపేట టీటీడీ కల్యాణ మండపంలో దసరా, దీపావళి పండుగలు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రుణమేళాను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యాపార రుణాలు, విద్యా రుణాలు, వ్యక్తిగత రుణాలు ఈ మేళాలో ఖాతాదారులు, లబ్ధిదారులు తెలుసుకుని దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. రెండు రోజుల పాటు జరిగే మేళాలో తక్కువ వడ్డీకి సంబంధిత పత్రాలు అందించిన తక్షణమే రుణం మంజూరు చేస్తామన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా రుణానికి వడ్డీ వర్తిస్తుందని, ప్రాసెసింగ్ చార్జీల మినహాయింపు కూడా ఉందన్నారు. తెనాలి రీజియన్ పరిధిలోని ఏ శాఖలోనైనా రుణ సౌకర్యం పొందవచ్చని చెప్పారు. బ్యాంకు అధికారులు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, మల్లికార్జునరావు, వాసుదేవరావు, మాధవీలత, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.







పెదకాకానిలో సరస్వతి దేవిగా భ్రమరాంబ అమ్మవారు, దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు, తెనాలి రామలింగేశ్వరపేట ఆలయంలో సరస్వతీ అలంకారం

వైభవంగా అమ్మవారికి మూలా నక్షత్రం పూజలు

చదువుల తల్లి సరస్వతిగా అమ్మవారు

తెనాలి అర్బన్, అక్టోబరు 9: చదువుల తల్లి సరస్వతి దేవిగా కనకదుర్గమ్మ దర్శనం ఇచ్చారు. మూల నక్షత్రం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాలలో బుధవారం అమ్మవారికి ఈ అలంకారం గావించారు. బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీ అమ్మవారిని మహాసరస్వతిదేవిగాను, రాజరాజేశ్వరి అమ్మవారిని మహాగౌరీదేవిగా అలంకరించారు. 100 ఉభయ దాతలు పూజాది కార్యక్రమాలు జరిపించారు. దాతల సహకారంతో అలంకారం, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య బృందం నర్తనశాల కూచిపూడి నృత్యరూపకం ప్రదర్శించారు. కె.కృష్ణంరాజు బృందం మిమిక్రి, కాకింగ్ డాల్ కార్యక్రమాలు నిర్వహించారు. దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో పొత్తూరి ఆదిలక్ష్మి బృందం భక్తి సంగీతం ఆలపించారు. శివాజీచౌక్‌లోని కాళీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మాదవరెడ్డి, సాంబశివరావుల సహకారంతో 500 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. రూరల్ మండలం నందివెలుగు కనకదుర్గమ్మ ఆలయంలో 108 ముత్తైదువులకు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ప్రమీలార్జునీయం హరికథాగానం ప్రదర్శించారు. లాస్య కూచిపూడి నాట్యాలయం కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యం భక్తులను ఆకట్టుకుంది.

● కొల్లిపర: మూలానక్షత్రం కావడంతో మండలంలోని శివాలయాల్లో బుధవారం అమ్మవారికి సరస్వతీదేవిగా అలంకరణ చేశారు. చదువుల తల్లికి విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విశేష పూజలు నిర్వహించారు. మహిళలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విద్యార్థుల చేత అక్షరాభ్యాసం చేయించారు. అదే విధంగా వల్లభాపురం, మున్నంగి, తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరణ చేయడంతో విద్యార్థులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

మనోహర్ పూజలు

తెనాలి రూరల్, అక్టోబరు 9:నందివెలుగులోని శ్రీ అగస్త్యేశ్వరస్వామి వారి ఆలయంలో కనకదుర్గమ్మ తల్లిని బుధవారం పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయానికి విచ్చేసి మనోహర్‌ను ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివార్ల దర్శనం అనంతరం వేద ఆశీస్సులు అందించారు. అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, ఆలయ అధికారులు, అర్చకస్వాములు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మనోహర్, పొన్నూరులో సరస్వతిదేవి అలంకారంలో కాశీ విశాలాక్షమ్మ

● తెనాలి రూరల్: పట్టణంలోని ఐతానగర్‌లో కనకదుర్గాసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో మాజీ మహిళా చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పాల్గొని అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిపారు.

● పొన్నూరు టౌన్: జీబీసీ రోడ్డులోని కనకదుర్గా భవానీ అమ్మవారి ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ సరస్వతి దేవిగా హంసవాహనంపై కొలువుతీరి ప్రత్యేక పూజలు అందుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణి చేశారు. అనంతరం ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

● పెదకాకాని: పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారు విద్యాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంను పరిశీలించిన తెలంగాణ బృందం

తెనాలి రూరల్, అక్టోబరు 9: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృంద సభ్యులు చెప్పారు. బుధవారం మండలంలోని ఎరుకలపూడిలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి బృందం, పలువురు రైతులు సందర్శించి సాగులో మెళకువలు, దిగుబడి వంటివాటిపై ఇక్కడ సాగుచేస్తున్న రైతులనుంచి తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు ఇక్కడికి రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సాగుదారులు విజయలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని పండించాలన్న ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నట్లు చెప్పారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తాము తీసుకుంటూనే నలుగురికీ అందించి వారిని కూడా తమ బాటలోనే నడిపించేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. తాను పండించే బియ్యం, కూరగాయలను తోటి రైతులకు అందిస్తూ వారిని కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించేలా ప్రకృతి వ్యవసాయ సాగు విధానాలున్నాయన్నారు. వినియోగదారులు కూడా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో ఆదాయం కూడా బాగానే వస్తుందని ఆమె వివరించారు. ప్రకృతి రైతులు ఈపూరు శ్రీధర్, మీసాల రామకృష్ణ తదితరులు తాము సాధించిన ఫలితాలను బృందానికి తెలియజేశారు. తెలంగాణాలో గతంలో ప్రకృతి వ్యవసాయం అమలు జరిగిందని ఇటీవల కాలంలో కొంత వెనుక పడటంతో మళ్లీ ముందుకు తీసుకెళ్లాలన్న భావనతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతో ప్రతినిధి బృందం వచ్చినట్లు ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అధికారి డీవీ రాయుడు తెలిపారు. పలువురు తెలంగాణ బృందసభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎరుకలపూడిలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న తెలంగాణ సీనియర్ అధికారులు

ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యం

సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ భద్రతాధికారి రమణారెడ్డి

పొన్నూరు టౌన్ (చేబ్రోలు) అక్టోబరు 9: ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తుందని సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ భద్రతాధికారి రమణారెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్లలో రైల్వే శాఖ బుధవారం రైలు ప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహించింది. ప్రధానంగా రైలు ప్రమాదాలు సంభవించిన సమయంలో బోగీల నుంచి ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించటంపై అవగాహన కల్పించారు. అలాగే ప్రమాద సమయంలో ప్రయాణికులను రక్షించే చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. రైలు ప్రమాదాలు సంభవించిన సమయంలో తలుపులు తెరుచుకునే పరిస్థితిలో కిటికీలను కత్తిరించి ప్రయాణికులను గాయాలపాలుకాకుండా బయటకు రప్పించే చర్యల గురించి మాక్ డ్రిల్ నిర్వహించారు. క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా వైద్య సేవలకు తరలించటం, ప్రథమ చికిత్సను అందించే చర్యలను తెలియజేశారు. ప్రమాద సమయంలో అగ్ని ప్రమాదం సంభవించి మంటలు, పొగ వ్యాపిస్తే తీసుకోవల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. భద్రతా విభాగం సిబ్బంది ప్రయాణికుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేసే విధానాల గురించి ప్రయోగపూర్వకంగా ఈ డ్రిల్‌లలో అవగాహన కల్పించారు. వీటిలో పాటు లోపాలు గుర్తించి మరోసారి ఆ లోపాలు జరగకుండా చేయాల్సిన సహాయక చర్యలను తెలియజేశారు. ప్రమాద సమయంలో కంట్రోల్ రూమ్‌ను అనుసంధానంగా పని చేయటం ప్రభుత్వ శాఖలైన రెవెన్యూ వైద్య, పోలీస్ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించటం వారి సహకారం తీసుకోవటం తోపాటు స్థానికుల సహకరం కోరాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ అధికారులు, సిబ్బంది, రైల్వే సిబ్బంది, గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ, ఆర్‌పీఎఫ్ అధికారులు బెటాలియన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న రైల్వే అధికారులు

వరిలో దోమపోటుపై అవగాహన కలిగి ఉండాలి

● లాం ఫాం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలత

తెనాలి రూరల్, అక్టోబరు 9: సుడిదోమ లేదా దోమపోటుకు గురైన వరిపైర్లలో రసాన్ని పీల్చడం ద్వారా పైరు లేతపసుపు వర్ణానికి మారుతుందని గుంటూరు లాంఫాం శాస్త్రవేత్త డాక్టర్ సీఏ శ్రీలత చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని రైతు సేవాకేంద్రాలు 1, 2 పరిధిలోని రైతులకు వరిపైర్లలో చీడపీడల నివారణపై అన్నదాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ సుడిదోమ లేదా దోమపోటుగా పిలవబడే పైర్లను తొలి దశలో గుర్తించి వాటి నివారణకు మెట్రోజెన్, ఫ్రూప్లూమిజోఫైరిన్ లేదా డైనోటిఫ్యూరాన్ వంటి మందుల్లో ఏదోఒకటి వ్యవసాయ సిబ్బంది సూచనలమేరకు పైర్లలో పిచికారి చేస్తే సమర్థంతంగా నివారించవచ్చన్నారు. ఏవో ప్రేమసాగర్ వరిలో నల్లి నివారణ గురించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయాధికారి డాక్టర్ రాజవంశి పాడిపంటల ఛానల్‌పై రైతులకు వివరించారు. వీఏఏ హోగ్లాశుభోదయ, ఏజెన్స్ పూలే, ఏఈవో మోహన్, గ్రామ కార్యదర్శి -2 జి, మాధవరావు, వీఆర్వో శివనాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శ్రీలత

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి: ఏవో

పొన్నూరు టౌన్, అక్టోబరు 9: వరి పైరులో నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరిగా పాటించాలని ఏవో డేగల వెంకట రామయ్య అన్నారు. మండల పరిధిలోని ములుకుదురులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం పిలుస్తోంది కార్యక్రమంపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామంలోని వరి పైరును పరిశీలించిన అనంతరం అధికారులు మాట్లాడుతూ వరి సాగులో నాటువేసిన దగ్గర నుంచి చిరు పొట్ట దశ వరకు నీరు ఆరుతడిలా అందించాలన్నారు. పైరుకు పొటాష్ ఎరువును అందించి తెగుళ్ల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. వరి చిరు పొట్ట దశలో ప్రతి ఎకరాకు 20-25 కిలోల పొటాష్ ఎరువు, 30కిలోల యూరియా పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి బొర్రు రామారావు, రైతుసేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత నీటి సరఫరాయే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు

పొన్నూరు టౌన్, అక్టోబరు 9: ప్రజలకు సురక్షిత నీరు సరఫరా చేయటమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు తెలిపారు. బుధవారం నిడుబ్రోలులోని పలు వార్డుల్లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటిని కమిషనర్ పరిశీలించారు. ఇటీవల నిడుబ్రోలులో రంగుమారిన నీరు సరఫరా అయ్యాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో పైప్‌లైన్లు, కుళాయిల మరమ్మతు చేయించటంతోపాటు తాగునీటి సరఫరా వ్యవస్థను కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



నిడుబ్రోలులో సరఫరా అవుతున్న నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్ బాబు

కులం ప్రత్యామ్నాయ సంస్కృతి గ్రంథం ఆవిష్కరణ

● దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరు టౌన్, అక్టోబరు 9: కులం ప్రత్యామ్నాయ సంస్కృతి అనే గ్రంథం దళిత మహాసభ ఉద్యమాలకు దిక్సూచి అని ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ వ్యవస్థాపకుడు డాక్టర్ కత్తి పద్మారావు అన్నారు. పట్టణంలోని లుంబినివనంలో బుధవారం కులం ప్రత్యామ్నాయ సంస్కృతి నాలుగో ముద్రణ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కత్తి పద్మారావు మాట్లాడుతూ ఈ గ్రంథాన్ని అన్ని లైబ్రరీలకు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ పుస్తకం మీద ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో ఈ అమూల్యమైన పుస్తకాన్ని చంద్ర రాజేశ్వరరావు చదివి అభినందించారని గుర్తుచేశారు. కాన్షీరాం, రామ్ విలాస్ పాశ్వాన్, వీపీ సింగ్ వంటి ప్రముఖులు ఈ పుస్తకాన్ని చదివి 120మంది ఎంపీలకు అందజేశారని వివరించారు. లండన్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో కూడా ఈ గ్రంథాన్ని ఆవిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బత్తుల విల్సన్‌బాబు, కనకవల్లి వినయ్‌బాబు, గేర ప్రశ్నకుమారి, అభ్యుదయ కవి శిఖాఆకాష్, కట్టా సృజన, దాసరి శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు బీమా: డీవీసీ డైరెక్టర్ బొర్రు

పొన్నూరు టౌన్, అక్టోబరు 9: డీవీసీ అభయ పథకాల ద్వారా పాడి పశువులకు, పాడి రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు సంగం డెయిరీ డైరెక్టర్ బొర్రు రామారావు తెలిపారు. మండల పరిధిలోని ములుకుదురు గ్రామంలో సంగం పాల రైతుకు బుధవారం పశు బీమా నగదును పంపిణీ చేశారు. సంగం పాల సొసైటీ పరిధిలోని పాల ఉత్పత్తిదారుడు లుక్కా ఏసుబాబు పాడి పశువు ఇటీవల మృతి చెందింది. డీవీసీ అభయ పశు సంక్షేమ పథకం ద్వారా ఏసుబాబుకు రూ. లక్ష నగదును అధికారులు అందజేశారు. కార్యక్రమంలో చిల్లింగ్ సెంటర్ మేనేజర్ కాట్రు నరేష్ బాబు, సూపర్‌వైజర్ బాలకృష్ణ, వెటర్నరీ విభాగం డాక్టర్ మణిరత్నం తదితరులు పాల్గొన్నారు.

రహీమ్ సాహెబ్‌కు దసరా పురస్కారం

పొన్నూరు టౌన్, అక్టోబరు 9: పొన్నూరు పట్టణానికి చెందిన కవి, గాయకుడు షేక్ రహీమ్ సాహెబ్‌కు దసరా పురస్కారం లభించింది. కళానైపుణ్యం ఉన్న ఉత్తమ కళాకారు గౌరవార్థం అవని వారధి చారిటబుల్ ట్రస్ట్ ప్రతిఏటా హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో దసరా పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. మంగళవారం హైదరాబాదులో అవనీ వారధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పొన్నూరుకు చెందిన రహీమ్ సాహెబ్‌కు ఈ దసరా పురస్కారాన్ని అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పి నరసయ్య గౌడ్, అర్చనా అగర్వాల్, గోపి బోయ తదితరులతో పాటు కళాకారులు పాల్గొన్నారు.



దసరా పురస్కారం అందుకుంటున్న కవి గాయకుడు రహీమ్ సాహెబ్

20న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

చేబ్రోలు, అక్టోబరు 9: ఈ నెల 20వ తేదీన చేబ్రోలులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహ ఆవిష్కరణ జరగనునట్లు ఎమార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సురేష్ తెలిపారు. బుధవారం చేబ్రోలు పాతరెడ్డిపాలెంలో విగ్రహ ఆవిష్కరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనునట్లు చెప్పారు. నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.